సాక్షి
చిత్తూరు
శనివారం, 9, మార్చి, 2024



పెంఛన్.. తోడుగా నిలిచెన్..!
ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ సద్వినియోగమవుతోంది. పెన్షనర్ల కుటుంబాలను ఆదుకుంటోంది. - 8లో



చెరుకు, మామిడి తోటల దగ్ధం
ఎస్ఆర్‌పురం మండలం పాదలపల్లె వద్ద శుక్రవారం రాత్రి చెరుకు, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. - 8లో



అన్నింటా మనమే
తిరుపతి శ్రీపద్మావతి వర్సిటీలో శుక్రవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

రీజినల్ కో–ఆర్డినేటర్‌గా మంత్రి పెద్దిరెడ్డి



తిరుపతి అర్బన్: అనంతపురం, హిందూపురం, చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా పంచాయతీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించారు. ఈమేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల విజయానికి కృషి చేయనున్నారు. ఆ మేరకు ఆయన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తల తోపాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. వేకువ జామునే ఆలయాన్ని శుద్ధి చేసి సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 10.30 నుంచి 12 గంటల నడుమ విశేష అభిషేకం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉభయకర్తలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాద కేంద్రంలో సుమారు 3వేల మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. చైర్మన్, ఈఓ మాట్లాడుతూ అన్నప్రసాద వితరణకు భక్తులు సహకారం అందించాలని కోరారు.

మణికంఠేశ్వరునికి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరఫున మణికంఠేశ్వర స్వామివారికి శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంటకేశు చేతులమీదుగా మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

పోటెత్తిన భక్తులు
శివరాత్రి సందర్భంగా మణికంఠేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం



వైద్యశిబిరంలో ఏఎస్పీ ఆరీఫుల్లా

చిత్తూరు అర్బన్ : మహిళలు ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఏఎస్పీ ఆరీఫుల్లా సూచించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అపోలో ఆస్పత్రి వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పోలీసు కుటుంబాల్లో మహిళలకు మధుమేహం, కీళ్ల, దంత, గర్భాశయ పరీక్షలు చేయించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు నిత్యం విధుల్లో నిమగ్నమైనా ఇంట్లోని మహిళలకు క్రమం తప్పకుండా మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. డీఎస్పీలు సుధాకర్ రెడ్డి, మహబూబ్‌బాషా, ఆర్ఐ నీలకంఠేశ్వర రెడ్డి, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, రవిశంకర్‌రెడ్డి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ భక్తులు తన్మయత్వంతో పులకించారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో స్వయంభువుగా విలసిల్లుతున్న ముక్కంటీశ్వరుని మహిమాన్విత స్వరూపాన్ని మహాశివరాత్రి పండుగ రోజున దర్శించి తరించారు. లింగోద్భవం సమయంలో సర్వేశ్వరుని నిజరూప వీక్షణానికి జనం పోటెత్తారు. జనజాగరణ చేసి.. జంగమయ్యను సేవించి పునీతులయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. శివయ్య శీఘ్రదర్శనానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు.



నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులు

- వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు
- కనీవినీ ఎరుగని రీతిలో భారీ ఏర్పాట్లు
- అర్ధరాత్రి దాటాక జంగమయ్య లింగోద్భవ దర్శనం
- ఆకట్టుకున్న కళారూపాలు

శంభో.. స్వయంభో



వాహన సేవలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. వాయులింగేశ్వరుడి నిజరూపాన్ని దర్శించేందుకు భక్తలోకం తరలివచ్చింది. శుక్రవారం వేకువ జామున 2 గంటలకే మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆలయ అర్చకులు పవిత్ర మంత్రోచ్చారణలు చేస్తూ స్వామి, అమ్మవార్లను పల్లియరతో మేల్కొల్పారు. అనంతరం గోపూజ నిర్వహించారు. సుప్రభాత సేవ తరువాత స్వామి, అమ్మవార్ల సర్వదర్శనానికి 3 గంటలకు అనుమతించారు. ఉదయం 5 నుంచి 10.30 గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకంతో పాటు క్షీరాభిషేకం పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగనుంది. ఉదయం 11గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది.

నంది వాహనంపై నీలకంఠుడివైభోగం
మహాశివరాత్రి పర్వదినం రోజైన శుక్రవారం రాత్రి స్వయంభు వాయులింగ స్వరూపుడైన శ్రీకాళహస్తీశ్వర స్వామివారు నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన స్వామివారి దేవేరి జ్ఞాన ప్రసూనాంబిక పరాక్రమాలకు ప్రతీక అయిన సింహ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు.

లింగోద్భవ దర్శనానికి ఏర్పాట్లు పూర్తి
లింగోద్భవ దర్శనానికి ఎలాంటి ప్రత్యేక ప్రవేశ రుసుం నిర్ణయించకుండా సామాన్య భక్తులు కూడా దివ్యదర్శనం చేసుకునే విధంగా ఉచిత మహాలఘు దర్శనాన్ని ఏర్పాటు చేశారు.

ఇంద్ర విమానంపై చిద్విలాసం



ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై పుర వీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. స్వామివారి దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై ఆసీనులై స్వామివారిని అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగుతూ ముందుకు సాగారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు వీధులు భక్తులతో నిండిపోయాయి. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

భక్తుల సేవకుడిని నేను



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉదయం నాలుగు గంటలకే ఆలయానికి చేరుకుని భక్తుల సేవలో తరించారు. స్వామివారి ఆలయం వద్ద వారికి పండ్లు, రుద్రాక్షాలను ప్రసాదంగా అందించారు. క్యూల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

సుపరిపాలనను ఆశీర్వదించండి



పట్టాలు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప



జెడ్పీ గెస్ట్‌హౌస్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప

- ప్రజలే మా బ్రాండ్ అంబాసిడర్లు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- జెడ్పీ గెస్ట్‌హౌస్ ప్రారంభం
- 1,200 మంది మహిళలకు భూ పంపిణీ

పుంగనూరు : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన జెడ్పీ అతిథిగృహాన్ని ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్పతో కలిసి ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని 1,200 మంది మహిళలకు 1,130 ఎకరాలకు సంబంధించి పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రజలకే స్టార్ క్యాంపెయినర్లు, బ్రాండ్ అంబాసిడర్లను తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఐదేళ్లలో పుంగనూరు నియోజకవర్గం అద్భుతంగా అభివృద్ధి చెందిందని వెల్లడించారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసి, అభివృద్ధిని కళ్లెదుట ఆవిష్కరించి ఓట్లు అడగడం చరిత్ర సృష్టించడమే అని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని స్పష్టం చేశారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.వేల కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అన్ని గ్రామాల్లో 20 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ప్రాంతంలో రెండు రిజర్వాయర్లను నిర్మిస్తుంటే చంద్రబాబు అడ్డుకున్నారని మండిపడ్డారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, తీర్పురాగానే ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీపై ఆర్థిక భారం తప్పించేందుకు సుమారు రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సోలార్ ప్యానల్స్‌కు నష్టం కలగకుండ రూ.69 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నామని వివరించారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో సైతం హంద్రీ–నీవా ద్వారా అన్ని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. కర్నూలు, అనంతపురం, మదనపల్లె, పుంగనూరు వరకు హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నా ఈనాడు పత్రికలో మాత్రం అసత్య కథనాలు, వార్తలు ప్రచురిస్తున్నారని విమర్శించారు. ఎల్లోమీడియాకు అభివృద్ధి కనపడదని, చిన్న సమస్యను భూతద్దంలో చూపించి ప్రజలను మోసపుచ్చేందుకే యత్నిస్తుందని ఆరోపించారు. పుంగనూరులో జర్మనీకి చెందిన పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ నెలకొల్పడంతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఫ్యాక్టరీ కోసం 800 ఎకరాలను సేకరించి నిర్వాసిత రైతులకు తగిన పరిహారం అందించే పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రెండేళ్లలో పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని, దీంతో అనేక అనుబంధ కంపెనీలు సైతం ఇక్కడకు వస్తాయని తెలిపారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రణాళికాబద్ధంగా పుంగనూరు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలోకి తీసుకువెళుతున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. శతరుద్ర మహాయాగం



నందివాహనంపై కొలువైన స్వామివారి సేవలో మంత్రి రోజా

నగరి : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో శాస్త్రోక్తంగా శతరుద్ర మహాయాగం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా వితరణగా అందించిన నంది వాహనంపై ఆదిదంపతులను కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులతో కలిసి మంత్రి రోజా పల్లకిని మోస్తూ ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి యాగకలశం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి, ఇంద్రారెడ్డి, దేశమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, శ్రీనివాసులు, ఎల్లప్పరెడ్డి, తేన్‌మొళి పాల్గొన్నారు.

ఆపత్కాలంలో కొండంత అండ
నగరి : ఆపత్కాలంలో ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఏడుగురికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.39 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన వారికి, ఆరోగ్య రీత్యా స్థాయికి మించి ఖర్చుచేసి ఇబ్బంది పడేవారికి అపన్నహస్తం అందిస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే పుట్టుకతో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారి రుద్రాంక్షికి రూ. 22 లక్షలు అందజేశామన్నారు. విజయపురం మండలం మాధవరంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆశీర్వాదం కుటుంబానికి రూ.5 లక్షలు, విజయపురంలో చెరువులో పడి మరణించిన టి.కుమార్ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇలా మొత్తం ఒకే రోజు రూ.39లక్షల ఆర్థిక సాయం అందించామని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులు మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.



చెక్‌లు అందుకున్న వారితో మంత్రి రోజా

సిద్ధేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తలకోన(భాకరాపేట): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీసిద్దేశ్వరస్వామి వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ జయకుమార్, ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

‘ఆరణి’తో బలిజలకు అన్యాయం

చిత్తూరు రూరల్: బలిజ కులస్తులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తీరని అన్యాయం చేశారని బలిజ సంఘం నేత మధుసూదన్‌రాయల్ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలుపొందారని, తర్వాత ఆరు నెలల్లోనే తన నిజస్వరూపం బయటపెట్టారన్నారు. ప్రజల్లో ఇమడలేకపోగా..అభివృద్ధిని సైతం నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బలిజల సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసులకు సత్తా ఉంటే బలిజల ప్రాబల్యమున్న గ్రామాల్లో ప్రజా బ్యాలెట్‌కు రావాలని సవాల్ విసిరారు.

రేపు చిత్తూరులో రాయల విగ్రహావిష్కరణ
నగరంలోని గంగినేని పార్కులో ఆదివారం శ్రీకృష్ణదేవరాయలవారి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు బలిజ సంఘ నాయకులు వివేకానందరవి, నందగోపాల్, రవినాయుడు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఈ విగ్రహ నిర్మాణానికి విజయానందరెడ్డి సొంత నిధులు వెచ్చించారని వెల్లడించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జగనన్న దయతోనే ఆరణి గెలుపు
చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగనన్న దయతో ఎమ్మెల్యేగా శ్రీనివాసులు గెలుపొందారని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం చిత్తూరులో వారు విలేకర్లతో మాట్లాడారు. సీటు ఇవ్వకపోతేనే ఆరణికి కులం గుర్తుకు వచ్చిందన్నారు. పదవుల కోసం పార్టీలు మారడం ఆరణికి అలవాటని ఆరోపించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగనేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు రమణ, సయ్యద్, మధురెడ్డి, గణేష్, సహదేవ్, స్వరూపరాణి, అజగర్‌ఖాను, కో–ఆప్షన్ సభ్యులు సునీత, మోబీనా, నేతలు గాయత్రీదేవి, శివ, నారాయణ, అంజలి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన సర్వేష్


గాయపడిన శీనప్ప

రామకుప్పం: మండలంలోని ఆరిమానుపెంట–వీర్నమల మార్గంలో నల్లరానుపేను క్రాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కావలిమడుగు గ్రామానికి చెందిన సర్వేష్(24), తండ్రి శీనప్పతో(44) కలసి బైక్‌పై వీర్నమలలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరూ కింద పడిపోయారు. తలకు తీవ్రమైన గాయం కావడంతో సర్వేష్ అక్కడికక్కడే మరణించగా, శీనప్ప గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు కుప్పం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

వి.కోట: పట్టణంలోని ఓ భవనంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వివరాలు.. పట్టణంలోని కేజీఎఫ్ రోడ్డులో మార్కెట్ యార్డ్ వద్ద డీఆర్‌కే భవనంలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే సమీపంలోని వాటర్ ప్లాంట్ నుంచి నీటిని తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో కొద్దిపాటి ఆస్తినష్టం తప్ప ఎలాంటి ప్రాణహాని జరగలేదని స్థానికులు వెల్లడించారు.

చెరుకు, మామిడి తోటల దగ్ధం


కాలిపోయిన చెరుకు పంట

శ్రీరంగరాజపురం : మండలంలోని పాదలపల్లె వద్ద శుక్రవారం రాత్రి ఐదెకరాల మామిడి, రెండెకరాల చెరుకు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు.. గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి రూ.10లక్షల విలువైన తోటలు దగ్ధమైనట్లు బాధిత రైతు మురగయ్య తెలిపాడు. అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకునే లోపే పంటలు కాలి బూడిదగా మారినట్లు వివరించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఆర్.అరవింద్ (23), ఎల్.రవితేజ (20) అనే ఇద్దరు నిందితులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. శుక్రవారం స్టేషన్ ఆవరణలో సీఐ ఉలసయ్యతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డివివరాలను మీడియాకు వెల్లడించారు. ఇందిరానగర్, రాజుగుడి వెనుక ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టగా తేనెబండకు చెందిన అరవింద్ అనే అప్పు, సంతపేట దొంగలబావివీధికి చెందిన రవితేజ పట్టుబడ్డారు. నిందితుల నుంచి 6.5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో విశాఖలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిను తీసుకొచ్చి చిత్తూరులో విక్రయిస్తున్నట్లు అరవింద్ అంగీకరించాడు. ఇదే కేసులో పరారైన ఆటో రవి అనే నిందితుడిని గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పింఛన్.. తోడుగా నిలిచెన్..!

నాడు

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్‌దార్ల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అప్పట్లో అందించే రూ.వెయ్యి పొందేందుకు రోజుల తరబడి నిర్దేశిత ప్రాంతం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. వేలిముద్రలు సక్రమంగా పడకపోవడంతో వృద్ధులు కాళ్లరిగేలా కార్యాలయాల తిరగాల్సి వచ్చేది. ఒక్కో పర్యాయం పది రోజులకు గానీ నగదు అందేది కాదు. ఈలోపు రవాణా ఖర్చే తడిసి మోపెడు అవుతుండేది. ఇక కొత్తగా పింఛన్ అర్హత రావాలంటే ఎవరో ఒక పెన్షనర్ మరణిస్తే కానీ మంజూరయ్యేది కాదు. అప్పటికీ జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు కచ్చితంగా కావాల్సి వచ్చేది. ఈ క్రమంలో లబ్ధిదారుల జీవనం దుర్భరంగా మారిపోయేది.

నేడు

ప్రభుత్వం అందించే పింఛన్ తీసుకునేందుకు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు వచ్చి ఇంటికే నగదు అందిస్తారు.ఆ వేలిముద్ర పడకపోతే ఐరిష్ విధానంలో నమోదు చేసి సొమ్ము అందజేస్తారు. విడతల వారీగా పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులకు ముట్టజెపుతారు. దీంతో రవాణా ఖర్చులు ఉండవు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు ఉండవు. జన్మభూమి కమిటీ సిఫార్సుల అవసరం ఉండదు. అర్హత ఉంటే ప్రతి నెలా అవసరాలకు పింఛన్ డబ్బులు అందుబాటులోకి వస్తాయి. ఎవరి దయాదాక్షిణ్యాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేదు.

జీవన పోరాటంలో అలసిసొలసిన అవ్వాతాతలకు ఆదరువుగా నిలుస్తూ.. ఆసరా లేని ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసానిస్తూ.. జీవిత భాగస్వామిని కోల్పోయి నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్న వితంతువులకు కనీస ఓదార్పునిస్తూ.. బతుకు బండి నడిపేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు తోడ్పాటునందిస్తూ ప్రభుత్వం సామాజిక పింఛన్లు పంపిణీ స్తోంది. వ్యక్తిగత అవసరాలకు ఎవరి వద్దా చేయి చాపాల్సిన అవసరం లేకుండా.. అభాగ్యుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేస్తూ పకడ్బందీగా పెన్షన్ సొమ్ముతో అండగా నిలుస్తోంది. ప్రతి నెలా ఒకటో తారీఖునే వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి రూ.3వేల నగదు అందిస్తోంది.


లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

- జిల్లావ్యాప్తంగా 2,76,008 మందికి లబ్ధి
- ప్రతి నెలా రూ.80.89 కోట్ల పంపిణీ
- కుటుంబాలకు సైతం చేయూతనందిస్తున్న పెన్షనర్లు
- ఆత్మగౌరవంతో జీవనం సాగిస్తున్న పండుటాకులు

చిత్తూరు అగ్రికల్చర్ : ప్రభుత్వం సామాజిక పింఛన్లను పకడ్బందీగా పంపిణీ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2,76,008 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.80.89 కోట్లు అందజేస్తోంది. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి మరీ నగదు అందిస్తోంది. తద్వారా అవ్వాతాలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, కిడ్నీ రోగులు తదితరులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఈ క్రమంలో పింఛన్‌దార్లు సైతం సజావుగా బతుకు బండి నడిపిస్తున్నారు. తమ సొంత అవసరాలకు పోను పింఛన్ నగదులో కొంత మిగుల్చుకుని మరీ పొదుపు చేసుకుంటున్నారు. కుటుంబీకులకు ఇబ్బందులు వచ్చినప్పుడు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. కేవలం సలహాల ద్వారానే కాకుండా ఆర్థికంగానూ తమ వంతు సాయం అందిస్తున్నారు. ఈ మేరకు బాధ్యతలను నిర్వర్తిస్తూ తమ విలువను మరింత పెంచుకుంటున్నారు. ప్రభుత్వం అందించిన చేయూతను సార్థకం చేసుకుంటున్నారు.

ఫీజు చెల్లిస్తున్నా



నేను దివ్యాంగుడిని. నాకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఇద్దరు పిల్లలను చదివించేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నా బిడ్డను చదివించుకుంటున్నా. దివ్యాంగుల గ్రూపు ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకుని ఫీజు చెల్లించా. ప్రతి నెలా వచ్చే పింఛను సొమ్ములో కొంత ఉపయోగించి ఆ రుణం తీరుస్తున్నా. మిగిలిన మొత్తంతో సమోసాలు తయారుచేసి విక్రయించి కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

– ఎం.వెంకటరమణారెడ్డి , బోరెడ్డిగారిపల్లి, రొంపిచెర్ల మండలం

కుటుంబానికి సైతం..



మాది నిరుపేద కుటుంబం. కూలికి వెళితే కానీ కుటుంబం గడవదు. నాకు ఒక కూతురు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోజు నా కూతురు, అల్లుడు కూలి పనులకు వెళతారు. నాకు ప్రతి నెలా ప్రభుత్వం రూ. 3 వేల పింఛన్ ఇస్తోంది. నేను ఇంటి పట్టునే ఉంటూ పిల్లలను చూసుకుంటూ. నాకు వచ్చే పింఛను డబ్బులను నాకోసమే కాకుండా, కుటుంబ అవసరాలకు సైతం వినియోగిస్తున్నా.

– వెంకటమ్మ, సురేంద్రనగరం ఏఏ దబ్ల్యూ , కార్వేటినగరం మండలం

రుణం తీరుస్తున్నా



ఐదేళ్ల క్రితం నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు ఇద్దరు కూతుళ్లు. రోజూ కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. వితంతు పెన్షన్ కింద నాకు ప్రతి నెలా రూ.3 వేలు వస్తున్నాయి. బిడ్డల చదువు కోసం డ్వాక్రా గ్రూపులో రుణం తీసుకున్నా. పింఛన్ సొమ్ములో కొంత ఇంటి ఖర్చులకు ఉపయోగించుకుని, మిగిలిన మొత్తంతో రుణం తీరుస్తున్నా. ప్రభుత్వం అందించే నగదు వల్ల ఇతరుల వద్ద చేయిచాపాల్సిన దుస్థితి తప్పింది.

– టి.రాధ, కొండామర్రి, చౌడేపల్లె మండలం.

మనవళ్ల చదువుకు సాయం



మాది నిరుపేద కుటుంబం. నాకు ఇద్దరు కుమారులు. వారికి పిల్లలు ఉన్నారు. నాకు వచ్చే పింఛను మొత్తంలో రూ.వెయ్యితో మందులు, ఇతర ఖర్చులకు వాడుకుంటా. మిగిలిన డబ్బులను అలాగే పొదుపు చేసుకుని పిల్లల చదువుకు ఫీజులకు ఇబ్బంది రాకుండా సాయం చేస్తుంటా. కుటుంబంలో ఏదైనా అత్యవసరమైతే నాదగ్గర ఉన్న డబ్బులను ఇస్తుంటా.

– లక్ష్మమ్మ, దండువారుపల్లె, బంగారుపాళ్యం మండలం

ఆనందంగా జీవిస్తున్నా



నాకు ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహమై వెళ్లిపోయారు. నా భార్య మృతి చెందడంతో నేను ఒంటరిగానే ఉంటున్నా. కూలి పనులకు కూడా వయో భారంతో వెళ్లలేకపోతున్నా. నాకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛను కింద ప్రతి నెలా రూ. 3 వేలు అందిస్తోంది. ఈ డబ్బుల్లో నా అవసరాలకు ప్రతి నెలా రూ. 2 వేల వరకు వాడుకుంటా. మిగిలిన నగదును పొదుపు చేసుకుంటా. ఎవరి మీదా ఆధారపడకుండా ఆనందంగా జీవిస్తున్నా.

– ఆనందరెడ్డి, తవణంపల్లె

సొంతంగా.. సంతోషంగా



నాకు ఐదుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. అందరికీ వివాహమైంది. నాకు ప్రభుత్వం వితంతు పింఛను కింద ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తోంది. నాకు ఆరోగ్యం సక్రమంగా ఉండదు. పింఛను డబ్బులతోనే మందులు కొనుగోలు చేసుకుంటా. నా అవసరాలకు పోను ఓ రూ.వెయ్యిని పోస్టాఫీసులో పొదుపు చేసుకుంటున్నా. దీంతో ఆర్థికంగా ఇబ్బంది తప్పింది. సొంతంగా.. సంతోషంగా జీవనం సాగిస్తున్నా.

– టి.పార్వతమ్మ, అంబేద్కర్ కాలనీ, పెనుమూరు

వేర్వేరు ప్రమాదాల్లో 11 మందికి గాయాలు


డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

పూతలపట్టు: మండలంలో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 11 మంది గాయపడ్డారు. వివరాలు.. పి.కొత్తకోట సమీపంలో ఓ కారు ముందు వెళుతున్న ట్యాంకర్‌ను వెనకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అలాగే మండలంలోని చవటపల్లె వద్ద జాతీయ రహదారిపై తిరుపతికి వెళుతున్న అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను తిరుపతిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌కు సాదర స్వాగతం


రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న అధికారులు

రేణిగుంట: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘనస్వాగతం లభించింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో కలెక్టర్ జీ.లక్ష్మీశ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుని తిరుమలకు బయల్దేరి వెళ్లారు. శనివారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుగుపయనం కానున్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ప్రోటోకాల్ ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, లైజన్ అధికారి లోకనాథం తదితరులు ఉన్నారు.

నేను చనిపోతున్నా..!


నిరంజన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వెంకటగిరి ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): 'నేను చనిపోతున్నా..'అంటూ వెంకటగిరి సమీపంలోని కోనమల్లేశ్వరస్వామి అడవుల్లో ఓ యువకుడి సెల్ఫీ వీడియో ఒకటి వెంకటగిరిలో కలకలం రేపింది. వెంకటగిరి పోలీసుల కథనం.. చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, దుర్గసముద్రం గ్రామానికి చెందిన తోటి నిరంజన్ (27) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఇంటి నుంచి వచ్చిన నిరంజన్ వెంకటగిరి రూరల్ మండలంలోని కోన మల్లేశ్వరస్వామి కోన వద్దకు చేరుకున్నాడు. తాను చనిపోతున్నాను.. అంటూ సెల్ఫీ వీడియో తీసి దాన్ని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా.. దాన్ని కుటుంబ సభ్యులు కంగారుపడ్డారు. వెంటనే డయల్ 100కు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెంకటగిరి సమీపంలోని కోనమల్లేశ్వరస్వామి కోనలో నిరంజన్ ఉన్నాడని తెలుసుకున్నారు. వెంటనే సీఐ సంగమేశ్వర రావు, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి రెస్క్యూటీమ్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నిరంజన్ జాడ గుర్తించి వెంకటగిరి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరంజన్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి యత్నించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అవార్డులు అందుకున్న అధ్యాపకులతో వర్సిటీ వీసీ భారతి, అతిథులు



అన్నింటా మనమే

- మహిళాభివృద్ధితోనే దేశం పురోభివృద్ధి
- మహిళా దినోత్సవంలో వక్తల పిలుపు
- మహిళా వర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుపతి సిటీ: ఆధునిక సాంకేతిక యుగంలో అన్ని రంగాలలో మహిళలు దూసుకుపోతూ అన్నింటా మనమేనని నిరూపిస్తున్నారని మహిళా వర్సిటీ వీసీ డి.భారతి కొనియాడారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీ ఉమెన్ స్టడీస్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ, మహిళలపై పెట్టుబడి పెట్టడం అనేది ప్రపంచ భవిష్యత్‌పై పెట్టుబడివంటిదన్నారు. మహిళా దినోత్సవం ప్రారంభించి వంద ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ మహిళలు లింగ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగసమానత్వం, మహిళా సాధికారత ధ్యేయంగా వర్సిటీ పనిచేస్తోందని చెప్పారు. అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ కీలకోపన్యాసం చేస్తూ, మహిళలు అవమానాలు, కట్టుబాట్లుకు తలొగ్గితే జీవితం శూన్యమన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ ప్రశ్నించేతత్వం కలిగి ఉండాలన్నారు.

మహిళలకు మాత్రమే ప్రత్యేకంగా జాబ్‌మేళా


గౌరవ అతిథిగా ఆటా ఇండియా కో–ఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశానికి బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. కుటుంబం మొదలు దేశాభివృద్ధి వరకు ఆమె పలు పాత్రలు పోషిస్తోందన్నారు. మహిళలకు మాత్రమే ప్రత్యేకంగా ఇక్కడ జాబ్ మేళా నిర్వహించేందుకు పూనుకుంటామని, దీనిపై వర్సిటీ అధికారులు కసరత్తు చేయాలని సూచించారు.

మాతృ.. ఆచార్య..అతిథిదేవోభవలో మనమే టాప్..!

ప్రముఖ సామాజిక వేత్త శ్రీలక్ష్మీరెడ్డి ప్రధానవక్తగా తన ప్రసంగంతో విద్యార్థినులను ఉర్రూతలూగించారు. మహిళల త్యాగాలే కుటుంబ అభివృద్ధికి మూలాలని చెప్పారు. 'మాతృదేవోభవ..పితృదేవోభవ..ఆచార్యదేవోభవ..అతిథిదేవోభవ'లో పితృదేవోభవ మినహా మిగిలిన మూడింటా కూడా మహిళలదే సాధికారత అని తనదైన శైలిలో విశ్లేషిస్తూ నవ్వులు పూయించారు. చదువొక్కటే ఆయుధం కాదు..సవాళ్లను కూడా ఎదుర్కొనే ధైర్యం కూడా ఉండాలని తన జీవితంతో ఎదురైన ఆటుపోట్లు, చదువునే వయసు నుంచి వివాహమైన తర్వాత కూడా చేసిన త్యాగాల గురించి విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా చెప్పారు. తాను చదువుకునే రోజుల్లో టెన్త్‌లో టాపర్ అని, పైచదువులు చదవాలనే ఆకాంక్ష బలీయంగా ఉన్నా వివాహం చేయడంతో తన కలలు కల్లలయ్యాయని, ఆ కసితో అనుక్షణం రగిలిపోతూ తన కుమార్తెల్లో ఒకరిని ఐఏఎస్ (రోహిణి సింధూరి), మరొకరి డెర్మటాలజిస్టును చేశానని, తనకు కార్పొరేటర్, ఎమ్మెల్యే సీటు ఆఫర్ వచ్చినా తిరస్కరించానని, అలాగే తాను పీహెచ్‌డీ, ఇటీవల బీఎడ్ కూడా పూర్తి చేశానని, చివరి శ్వాస వరకు చదువు తూనే ఉంటాననడంతో సెమినార్ హాల్ కరతాళధ్వనులతో మార్మోగింది. మహిళలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, తనను సంప్రదించవచ్చని ఆమె ప్రకటించారు. అనంతరం వర్సిటీ అభివృద్ధికి కృషి చేసిన ప్రొఫెసర్ జ్యోతి, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరిని ప్రత్యేక అవార్డులతో అధికారులు సత్కరించారు. వారితో పాటు వర్సిటీలోని 22 మంది అధ్యాపకులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే జర్నల్స్‌ను ఆవిష్కరించారు. డీన్ అనురాధ, డాక్టర్ నీరజ, ప్రొఫెసర్లు సీతాకుమారి, కాత్యాయిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు ప్రభుత్వాలు ప్రాధాన్యం

- ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ
- మల్టీ పర్పస్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం


మల్టీ పర్పస్ హాల్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ మధుస్మిత

తిరుపతి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారికతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆదాయపు పన్నుశాఖ ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ మధుస్మిత అన్నారు. తిరుపతి ఆదాయపు పన్నుశాఖ ప్రధాన కార్యాలయంలో నూతన మల్టీ పర్పస్ హాల్‌ను ఆమె, బ్యాడ్మింటన్ కోర్టును ఆదాయపు పన్నుశాఖ తిరుపతి, హైదరాబాద్ కమిషనరేట్ల చీఫ్ కమిషనర్ నరసమ్మ శుక్రవారం ప్రారంభించారు. సరదాగా చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఉద్యోగినులతో కలిసి ఫొటోలకు దిగారు. మిథాలీ మధుస్మిత మాట్లాడుతూ ఆర్థిక భరోసాతో మహిళా సాధికారిత సాధ్యమని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారుల హక్కులను కాపాడడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నరసమ్మ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్నుశాఖ కీలక అధికారులు మహిళలు కావడం ప్రత్యేకమని తెలిపారు. ఈనెల 15వ తేదీ లోపు పన్ను చెల్లింపుదారులు అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలని కోరారు. ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ వంశీధర్, అడిషనల్ కమిషనర్ శోభ, అసిస్టెంట్ కమిషనర్ దయానంద్ ప్రసాద్, అధికారి(ప్రొటోకాల్) వెంకటబాలాజీ పాల్గొన్నారు.